

అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

ఆదివారం 28 ఆగస్టు 2022 పేజీలు : 04


# మేజర్ పంచాయతీకి దిక్కెవరు..?

**- అక్కడి అధికారి చేతిలో ఇక్కడి పాలన**



పూర్తిస్థాయి అధికారి కోసం ఎదురుచూస్తున్న యాడికి పంచాయతీ

**తాడిపత్రి, ప్రభాతవార్త**

7,367 కుటుంబాలు, 8 గ్రామాలతో కూడిన యాడికి మేజర్ పంచాయతీకి తాడిపత్రి మండలం గన్నెవారిపల్లె పంచాయతీ కార్యదర్శే ఇన్‌ఛార్జి కార్యదర్శిగా వ్యవహరిస్తున్నందున పాలన అస్తవ్యస్తంగా మారింది. కొంత కాలంగా ఇలా కొనసాగుతుండటంతో ధ్రువీకరణ పత్రాల జారీ నిలిచిపోయింది. వివిధ రకాల పనుల కోసం కాళ్లరిగేలా తిరిగినా ప్రయోజనం లేదని జనం వాపోతున్నారు.

**- పరిపాలనకు దిక్కెవరు..!**

యాడికి మేజర్ పంచాయతీకి జూనియర్ సహాయకునిగా ఉరవకొండ నుంచి వచ్చిన నాగరాజుకు బదిలీపై వెళ్లిన జూనియర్ సహాయకుడు ఇప్పటి వరకు బాధ్యతలు అప్పగించకపోవడంతో పాలనా పరమైన ఇబ్బందులు ప్రజలను వేదిస్తున్నాయి. పేరుకే పెద్ద పంచాయతీ. అధికారులు లేక సమస్యలతో విలవిలలాడుతోంది. యాడికితో పాటు మరికొన్ని పంచాయతీలకు సమర్థులైన కార్యదర్శులు లేక అభివృద్ధి కుంటుపడుతోంది. వాస్తవానికి యాడికి వంటి మేజర్ పంచాయతీకి గ్రేడ్‌వన్ కార్యదర్శిని నియమించాల్సి ఉండగా ఎక్కడో ఉన్న ఇన్‌ఛార్జి గ్రేడ్‌వన్ కార్యదర్శితో పాలన సాగిస్తున్నారు. పంచాయతీ కార్యాలయంలోని విధులనైనా



అద్దెల వేలం ముగిసినా పట్టింపులేని పంచాయతీ భవనాలు



సమస్యల గ్రహణం వీడని వాణిజ్య సముదాయం

సక్రమంగా నిర్వహించడానికి వీలు లేకుండా సిబ్బందికి బాధ్యతలను అప్పగించడంలో అధికారులు విఫలమవుతున్నారు.

**గాడితప్పిన సేవలు :**

యాడికి మేజర్ పంచాయతీలో అడ్డుచెప్పేవారే లేకపోవడంతో ఎడాపెడా ఆక్రమణలు జోరందుకున్నాయి. దారులను ఆక్రమించుకుంటూ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నా పట్టించునే సిబ్బంది లేకపోవడంతో పంచాయతీ పాలన గాడి తప్పుతోంది. జనన, మరణ ధ్రువీకరణ పత్రాల కోసం జనం రోజుల తరబడి పంచాయతీ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోంది. కార్యాలయం వద్దకు వెళితే సారెప్పుడొస్తారంటూ అడగాల్సిన దుస్థితి నెలకొంది.

# అభిమానుల్లో జోష్ నింపుతున్న జెసి దివాకర్‌రెడ్డి పర్యటనలు



మాజీ ఎంపి జెసి దివాకర్‌రెడ్డి శనివారం పెద్దవడుగూరులో పర్యటన దృశ్యం

**అనంతపురం, ఆగస్టు 27 ప్రభాతవార్త బ్యూరో**

టీడీపీ సీనియర్ నేత, మాజీ పార్లమెంట్ సభ్యులు జెసి దివాకర్‌రెడ్డి ఇటీవల కాలంలో తాడిపత్రి నియోజకవర్గంలో సైలెంట్‌గా సుడిగాలి పర్యటన నిర్వహిస్తూ తన మద్దతు దారులను కలుసుకుంటున్నారు.

ఎలాంటి రాజకీయ ప్రకటనలు చేయకుండా దివాకర్‌రెడ్డి పల్లెల్లో పర్యటిస్తుండటం చర్చనీయాంశంగా మారింది. ఎలా ఉన్నారు, బాగా ఉన్నారా, పంటలుఎలా ఉన్నాయి, పిల్లలు ఏం చేస్తున్నారు అని తన మద్దతు దారులను అడుగుతున్నారు. కార్యకర్తలతో కలుసుకుంటున్నారు. తాడిపత్రి, యాడికి, పెద్దపప్పూరు మండలాల్లో కొన్ని గ్రామాల్లో ఇప్పటికే పర్యటించి జెసి దివాకర్‌రెడ్డి శనివారం పెద్దవడుగూరు మండల కేంద్రంలో పర్యటించడం విశేషం. పెద్దవడుగూరు కి జెసి దివాకర్‌రెడ్డి రాకతో టిడిపి క్యాడర్‌లో కొత్తజోష్ నింపుతున్నారు. దివాకర్‌రెడ్డి గ్రామాల్లో పర్యటనలు ఎందుకు చేస్తున్నారు..? కారణం ఏమి అయి ఉంటుంది అన్నది రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. గ్రామాల్లో తమ వర్గము పట్టు సడలకుండా ఉండేందుకు ఈ పర్యటనలు చేస్తున్నారని అభిప్రాయం ఉంది. ఇటీవల కాలంలో మాజీ ఎంపి జెసి దివాకర్‌రెడ్డి, ఆయన సోదరుడు, తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి, వారి కుమారులు సైలెంట్‌గా ఉన్నారు. రాష్ట్రంలో రాజకీయ దుమారం లేచినా జెసి సోదరులు సైలెంట్‌గా ఉన్నా విషం తెలిసిందే. హిందూపురం ఎంపి గోరంట్ల మాధవ్ వ్యవహారంలో వారు నోరు మెదప లేదు. ఎలాంటి వ్యాఖ్యలు, ఆరోపణలు చేయలేదు. ఇదే సమయంలో టిడిపి అధినేత చంద్రబాబునాయుడు కుప్పం నియోజకవర్గంలో పర్యటించారు. ఆ సమయం లో జరిగిన ఘర్షణలు పై రాష్ట్రంలో టీడీపీ నేతలు వైసిపి ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. అయితే జెసి సోదరులు మాత్రం మౌనంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో జెసి సోదరుల వ్యూహం ఎమిటి అన్నది అర్థం కావడం లేదు. టిడిపి యువనేత జెసి పవన్‌రెడ్డి కూడా పార్టీ కార్యక్రమాలకు చాలా దూరంగా ఉంటున్నారు.

# రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం

**-రాష్ట్ర స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి ఉషశ్రీచరణ్ -మానిరేవులో రైతులకు సూక్ష్మనీటి పరికరాల పంపిణీ**



రైతులనుద్దేశించి ప్రసంగిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్



రాయితీ సూక్ష్మ నీటి పరికరాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

**కళ్యాణదుర్గం, ఆగస్టు 27 ప్రభాతవార్త**

రైతన్నల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, రైతులు వ్యవసాయం చేయడంలో ఎలాంటి ఇబ్బందులు పడకుండా వారికి అవసరమైన సేవలు అందించి, వ్యవసాయాన్ని పండగ చేయాలని ముఖ్యమంత్రి జగనన్న పరితపిస్తున్నారని, అందుకే గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి, రైతుల ఇంటి గుమ్మం వద్దకే పథకాలు అందిస్తున్నారని రాష్ట్ర స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని మానిరేవు గ్రామంలో రాయితీలపై రైతుల వద్దకే సూక్ష్మనీటి పరికరాలను పంపిణీ చేసే కార్యక్రమాన్ని మంత్రి ప్రారం భించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగసభలో అమె ప్రసంగిస్తూ రా ష్ట్ర ప్రభుత్వం కరువు జిల్లాగా పేరున్న అనంతపురం జిల్లా రైతుల కోసం రాయితీలపై సూక్ష్మ నీటి సేద్యపు పరికరాలను అందిస్తోందన్నారు. ఈ పథకం ద్వారా 5 ఎకరాల లోపున్న రైతులకు 90శాతం, 5ఎకరాలపైన ఉంటే 70శాతంతో డ్రిప్ పరికరాలను అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఐదు ఎకరాలలోపు ఉన్న రైతులకు 50శాతం సబ్సిడీతో స్ప్రింకర్లు కూడా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులందరూ ఈ పరికరాలను సద్వినియోగం చేసుకుని తక్కువనీటితో ఫల వ్యవసాయం చేసుకుని లబ్దిపొందాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జడ్పి చైర్మన్ గిరిజ మాట్లాడుతూ వైఎస్అర్ కాంగ్రెస్‌పార్టీ రైతుల ప్రభుత్వమని, రైతులు ఉన్న ఊళ్లోనే రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు రైతు భరసా కేంద్రాల ద్వారా అందుబాటులో ఉంచడమే కాకుండా వ్యవసాయసంబంధ మైన పరిజ్ఞానాన్ని కూడా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా డ్రిప్ పరికరాల పంపిణీ కార్యక్రమాన్ని కూడా మానిరేవులో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు, వైకాపా నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# హెర్బల్ న్యూట్రీషన్ పేరుతో ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం

**- నియోజకవర్గంలో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న హెర్బల్ క్లబ్‌లు**

**- అమాయకులైన ప్రజలే లక్ష్యంగా వ్యాపారం - హెర్బల్ న్యూట్రీషన్‌తో సన్నబడతారనేదె వారి ఆయుధం**

**మడకశిర టౌన్, ఆగస్టు 27 ప్రభాతవార్త**

ప్రజల్లోని బలహీనతలను పెట్టుబడిగా పెడుతున్నాయి పలుకంపెనీలు. లావు తగ్గాలని, రక్త హీనత నుంచి విముక్తి పొందాలని, అందంగా తయారు కావాలని ఆశ పడే వారిని ఆకర్షించి హెర్బల్ లైఫ్ అనే గొలుసుకట్టు కంపెనీ అమాయకులైన ప్రజల నుంచి ఇష్టారాజ్యంగా డబ్బు దండుకుంటోంది. దేశ వ్యాప్తంగా జరుగుతున్న ఈ చైన్ బిజినెస్ మడకశిర నియోజకవర్గంలో కూడా వ్యాపించింది. ఎంతో మంది ఎంబిబిఎస్, ఆయుర్వేదిక్ కోర్సులు చేసిన వైద్యులే బరువు తగ్గడానికి ఆరోగ్య నియమాలు పాటించాలని సలహాలు ఇస్తారే తప్పా మందులు ఇవ్వడానికి భయపడుతారు. అయితే హెర్బల్ లైఫ్ అంటే ఏ మాత్రం పరిశోధనలు తెలియని వారు కూడా ఈ ప్రొడక్ట్‌ను విక్రయిస్తు సొమ్ము చేసుకుంటున్నారు. ఇటీవల వరంగల్ జిల్లాలో అనిత అనే మహిళ పనికిరాని ఈ హెర్బల్ న్యూట్రిషన్ మందులు తీసుకుని కోమాలోకి వెళ్లిన విషయం విధితమే. దీంతో ఎన్నోసార్లు ఈ ప్రొడక్ట్ ఉపయోగించిన వారు విషమని చెబుతున్నా డబ్బులు ఆశతో ప్రత్యేక తరగతులను నిర్వహించి ప్రజలని మభ్య పెట్టి ఇందులోకి దించుతున్నారు. మడకశిర నియోజకవర్గంలోని 5 మండలాల్లో దాదాపు 14 క్లబ్‌లు అనధికారికంగా వెలిశాయి. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఇస్తున్న ప్రొడక్ట్ ఒరిజినల్ నా కాదా అనే విషయం కూడా తెలుసుకోకుండా అమ్మేస్తున్నారు. మరోవైపు మొదట ఇందులో చేరి రూ.4500 చెల్లిస్తే 4 రకాల మందులు ఇస్తారు. దీంతో పాటు మరో నలుగురిని చేర్పిస్తే డబ్బు ఆదాయం వస్తుందని ప్రజలకు ఎరవేస్తున్నారు.

**వెనుకబడిన ప్రాంతాల్లో మోసాలు :**

అసలే మడకశిర నియోజకవర్గంలో ఉపాధి లేక నిత్యం వ్యవసాయం, కూలీ పనులు చెసుకుని జీవనం సాగిస్తున్నారు. మడకశిర మండలంలోని ఓ గ్రామంలో దాదాపు 10 మంది కూలీ పని చేసుకుని జీవించే వారు పట్టణంలోని సాయినగర్‌లోని ఓ భవనంలో కర్ణాటక ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి ఏర్పాటు చేసుకున్న క్లబ్‌లో వారు తొలుత ఒక్కొక్కరు రూ.600 చెల్లించి ఈ హార్బల్ అనే పౌడర్ మందును తాగారు. అయితే ఎలాంటి ప్రయోజనం లేకపోవడంతో పాటు ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని విలేకరుల దృష్టికి తీసుకొచ్చారు. మరో వ్యక్తి ఏకంగా 3 నెలలు రూ.34వేలు చెల్లించగా అతడికి 7 సెట్లు హెర్బల్ ప్రొడక్ట్ మందులు ఇచ్చారు. అయినా తనకు ఎలాంటి ఉపయోగం లేదని వాపోయాడు. ఇలా నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజల బలహీనతతో ఆడుకుంటూ దాదాపు రూ.కోట్లలో వ్యాపారం చేస్తున్నారు. హెర్బల్ పేరుతో మోసాలు చేస్తున్న వారిపై సంబందిత అధికారులు, పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి ప్రజల ఆరోగ్యం దెబ్బతినకుండా, మోసపోకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



# తండ్రి పునఃప్రవేశం..తనయుని ప్రయోజనం కోసమేనా..?

**- గ్రామాల్లో మాజీ ఎంపీ సందడి - పవన్ రాకకోసం అభిమానుల ఎదురు చూపులు**



గ్రామాల్లో పర్యటిస్తున్న జేసీ దివాకర్‌రెడ్డి

**తాడిపత్రి, ప్రభాతవార్త**

అనంతపురం మాజీ ఎంపీ, తాడిపత్రి శాసన సభ స్థానానికి సుదీర్ఘ కాలం పాటు ప్రాతినిథ్యం వహించిన జేసీ దివాకర్‌రెడ్డి ప్రస్తుతం చేపట్టిన గ్రామాల పర్యటన ఆయన అభిమానుల్లో నూతనోత్సాహం నింపుతోంది. పెద్దపప్పూరు, యాడికి మండలాల్లో ఆయన పర్యటిస్తూ తన పూర్వ అనుచరులతో ముచ్చటిస్తున్నారు. ఇదంతా తనయుని రాజకీయ ప్రయోజనం కోసమేనా అనే చర్చ పల్లెల్లో సాగుతోంది. చాలా కాలం తర్వాత తమను కలవడానికి తమ నాయకుడు వస్తున్నాడని తెలిసి చాలా కాలంగా స్తబ్దుగా ఉన్న ఒకప్పటి గ్రామ స్థాయి నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలుకుతున్నారు. ఆయన వయసు రీత్యా ఆరోగ్యం సహకరించకపోయినా తన పూర్వపు అనుచరులను గుర్తుపెట్టుకొని క్షేత్రస్థాయికి వచ్చి పరామర్శిస్తుండటం చర్చనీయాంశంగా మారింది. దీంతో జేసీ పవన్ రాక కోసం దివాకర్‌రెడ్డి అనుచరులు ఎదురు చూస్తున్నారు.

**- జేసీ పవన్‌కు మార్గం సుగమం చేయడానికేనా..!**

మరో రెండేళ్లలో సాధారణ ఎన్నికలు రానుండగా ఇప్పటి నుంచే నియోజకవర్గంలోని పల్లెల్లో రాజకీయ వేడి రగులుకుంటోంది. పూర్వ వైభవాన్ని చేజిక్కించుకోవడానికి, తనయునికి సుస్థిర స్థానం కల్పించడానికి మాజీ ఎంపీ గట్టిగానే ప్రయత్నిస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. జేసీ కుటుంబంలో ఈ సారి ఎవరిని పార్టీ టికెట్ వరించనుందో అనే సందిగ్ధంలోఆ పార్టీ కార్యకర్తలు ఉన్నారు.

# రాజకీయ ఉనికి కోసమే చంద్రబాబు కుట్రలు

**- ప్రజలు బుద్ధి చెప్పినా మారని బాబు నైజం - అర్హత ప్రామాణికంగా సీఎం జగన్ సంక్షేమ పాలన - అర్బన్ ఎమ్మెల్యే అనంత**



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే, ఎంపి

**అనంతపురం సిటీ, ఆగస్టు 27 ప్రభాతవార్త**

రాష్ట్రంలో టీడీపీ కనుమరుగవుతోందన్న భయంతోనే రాజకీయ ఉనికి కోసం టీడీపీ నాయకులు చంద్రబాబునాయుడు కుట్రలకు పాల్పడుతున్నారని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. నగరంలోని 44వ డివిజన్‌లో శనివారం స్థానిక కార్పొరేటర్ శాంతిసుధతో కలిసి అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అనంతపురం పార్లమెంట్ సభ్యులు తలారి రంగయ్య గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. ఇదే సందర్భంలో స్థానికుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హత ప్రామాణికంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేపట్టని విధంగా సంక్షేమ పథకానలు ప్రజల ముంగిటకే పార్టీలు, కులాలు, మతాలకతీతంగా అందిస్తుండటంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన పట్ల ప్రజల్లో విశ్వాసం పెరిగిందన్నారు. దీంతో మూడేళ్లలో జరిగిన ప్రతి ఎన్నికల్లోనూ ప్రజలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని ఆదరిస్తున్నారన్నారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పంలో సైతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్ల విశ్వాసంతో అన్ని స్థానిక సంస్థల్లోనూ వెస్ఆర్‌సిపిని ఆ ప్రాంత ప్రజలు ఆదరించి అన్ని ఎన్నికల్లోనూ గెలిపించారన్నారు. రానున్న ఎన్నికల్లో కుప్పంలో సైతం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గెలుపొందే అవకాశం ఏర్పడిందన్నారు. దీంతో ఓటమి భయంతో చంద్రబాబునాయుడు కుట్రలకు తెరలేపుతున్నారని అనుమానం వ్యక్తం చేశారు. రాజకీయ లబ్ది పొందడానికి ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తునా న్నరన్నారు. 30 ఏళ్ల పాలనలో కుప్పంను చంద్రబాబునాయుడు పట్టించుకోకపోవడం వలేల మూడేళ్ల కాలంలో ముఖ్యమంత్రి పాలనను బేరీజు వేసుకున్న ఆ ప్రాంత ప్రజలు వైఎస్ఆర్‌సిపిని ఆదరిస్తుండటంతో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిని విమర్శించడమే కాకుండా ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు ఎన్ని జిమ్మిక్కులు చేసినా ఆ ప్రాంత ప్రజలు నమ్మరని, చంద్రబాబుపై విశ్వాసాన్ని కోల్పోయారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా ప్రజా మద్దతుతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వాటన్నింటినీ అధిగమనిస్తారని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో మేయర్ మహ్మద్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కొగటం విజయభాస ్కర్‌రెడ్డితోపాటు పలువురు వైసీపీ నేతలు పాల్గొన్నారు.

## పిల్లలకు వైద్య చికిత్సలు అందించడంలో

# నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

**- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు**



ఆసుపత్రిలో చిన్న పిల్లల వార్డును సందర్శిస్తున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు



మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు

**అనంతపురం, ఆగస్టు 27 ప్రభాతవార్త బ్యూరో**

పిల్లలకు వైద్య చికిత్స అందించడంలో నిర్లక్ష్యం వహిస్తేచర్యలు తప్పవని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌చైర్‌పర్సన్ కేసలి అప్పారావు తెలిపారు. శనివారం ఉదయం స్థానిక అనంతపురం పట్టణం శ్రీనగర్ కాలనీలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిలచే జరిగిన ఫోక్సో కోర్టు ప్రారంబోత్సవ కార్యక్రమానికి హాజరైన అనంతరం జిల్లా సర్వజన ఆసుపత్రిలో చిన్న పిల్లల వైద్య విభాగంను సందర్శించి పిల్లలకు అందిస్తున్న వైద్య సేవల గురించి ఆరాతీశారు. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ చికిత్స కొరకు ఆసుపత్రికి వచ్చే పిల్లల పట్ల తీసుకుంటున్న చర్యల గురించి డిఎం అండ్ హెచ్‌ఓ, ఆర్ఎంఓ, చిన్న పిల్లల వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా వార్డులోనిచికిత్స పొందుతున్న చిన్నారులు, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. తదనంతరం సంబంధిత వైద్యులు, వైద్య సిబ్బందితో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ మాట్లాడుతూ.. ఆసుపత్రికి చికిత్సకు వచ్చే పిల్లల పట్ల ఎటువంటి నిర్లక్ష్యం వహించకుండా సత్వరమే వైద్య సేవలు అందించాలని సూచించారు. అంతేకాకుండా ఎవరైనా ఆసుపత్రి ఆవరణంలో చిన్న పిల్లలను వదిలి వెళ్లినా, అట్టి సమాచారాన్ని చైల్డ్‌లైన్ 1098 సమాచారం అందించాలని, ఆ పిల్లలను సంబంధిత అధికారుల ద్వారా తల్లిదండ్రులు గుర్తించి అప్పగించడం లేదా ప్రభుత్వంచే పడుపబడుతున శిశు గృహంకు అప్గపించాలని ఆదేశించారు. అలాకాకుండా అనధికారికంగా ఆ పిల్లలను వేరే వారికి పెంచుకొనుటకు ఇస్తే చట్టపరంగా తీవ్రమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్, సభ్యులు పంగల్ రోడ్డులో ఆర్డిటి సంస్థ ద్వారా నడుపబడుతున్న దివ్యాంగ పిల్లల రెసిడెన్షియల్ స్కూల్‌ను సందర్శించి పిల్లలకు ఆర్డిటి సంస్థ ద్వారా అందించే ప్రత్యేక విద్య, వసతి, రక్షణ సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. దివ్యాంగ పిల్లలచే నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలను వారు తిలకించి పిల్లలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు.

## వెలుగని క్లాక్‌టవర్, ప్రధాన రోడ్డులోని ఎల్‌ఈడీ లైట్లు..!

**-ఇబ్బందులు పడుతున్న ప్రజలు, వాహన చోదకులు, చిరువ్యాపారులు**



క్లాక్‌టవర్ ఎల్‌ఈడీ లైట్లు వెలుగకపోవడం తో తెల్లవారుజామున అంధకారం దృశ్యం

**ఉరవకొండ, ఆగస్టు 27 ప్రభాతవార్త :** నియోజకవర్గ కేంద్రమైన ఉరవకొండ పట్టణంలోని క్లాక్‌టవర్‌కు అమర్చిన ఎల్‌ఈడీ లైట్లతో పాటు ప్రధాన రోడ్డులోని ఒక్క వీధి దీపం సైతం గత 3 రోజులుగా వెలుగక పోవడంతో చిమ్మచీకట్లలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. క్లాక్‌టవర్ చుట్టూ నాలుగు భారీ ఎల్‌ఈడీ లైట్లు ఉండగా ఆ లైట్ల వెలుగులో తెల్లవారుజాము సమయంలో చిరువ్యాపారులు ఆకుకూరలు, పండ్లు, కాయగూరలు హోల్‌సేల్ వ్యాపారులను నుండి కొనగోలు చేసుకొని విక్రయించుకోవడం జరుగుతూ వస్తోంది. అయితే లైట్లు



వీధిలైట్లు సైతం వెలుగకపోవడంతో అంధకారంలో ప్రధాన రోడ్డు

వెలుగకపోవడంతో చిమ్మ చీకట్లలో సెల్‌ఫోన్లు, టార్చి లైట్ల వెలుగులో చిరువ్యాపారులు తెల్లవారుజాము సమయంలో అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వీధిలైట్లు వెలుగకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడటమే కాకుండా ప్రమాదాలకు గురవుతుండగా పట్టించుకునేవారే లేకుండా పోయారు. మేజర్ గ్రామ పంచాయతీ వెంటనే తగిన చర్యలు తీసుకొని క్లాకటరవ్ ఎల్‌ఈడీ లైట్లతోపాటు ప్రధాన రోడ్డులో వీధి దీపాలు వెలిగేలా చూడాలని ప్రజలు, చిరువ్యాపారులు, వాహనచోదకులు కోరుతున్నారు.

## వైభవంగా శ్రీ కల్లంబండ ఆంజనేయస్వామి పల్లకీ ఉత్సవం

**-శ్రావణ అమావాస్య కావడంతో ప్రత్యేక పూజలు, అన్నదానం**



శ్రీ కల్లంబండ ఆంజినేయస్వామి పల్లకి సేవ కొనసాగుతున్న దృశ్యం

**ఉరవకొండ, ఆగస్టు 27 ప్రభాత వార్త :** మండల పరిధిలోని చిన్నముష్టూరు గ్రామానికి సమీపంలో అనంతపురం-బళ్లారి 42వ నంబర్ జాతీయ రహదారికి పక్కన వెలసిన శ్రీ కల్లం బండ ఆంజనేయస్వామి వారి పల్లకీ ఉత్సవం శ్రీ శుభకృత్‌నామ సంవత్సరం శ్రావణ అమావాస్య శనివారం సాయంత్రం వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించి పల్లకీలో కొలువుదీర్చిన అనంతరం ఆలయం చుట్టూ ఉత్సవం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. శ్రావణ మాసంలో ప్రతి శనివారం నిర్వహిస్తున్న పల్లకీ ఉత్సవంలో భాగంగా ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు అభిషేకాలు, విశేష పూజలు కొనసాగాయి. వివిధ ప్రాంతాల నుండి పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులకు అన్నదానం నిర్వహించారు.

## వైభవంగా శ్రీ లక్ష్మినరసింహుని ప్రాకారోత్సవం

**-శ్రీ లక్ష్మినరసింహస్వామి వారికి ప్రత్యేక పూజలు**



శ్రీవారి ప్రాకారోత్సవం దృశ్యం

**ఉరవకొండ, ఆగస్టు 27 ప్రభాతవార్త :** మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళంలో వెలసిన శ్రీ లక్ష్మినరసింహస్వామి ఆలయంలో స్వస్తిశ్రీ శుభకృత్ నామ సంవత్సరం శ్రావణ బహుళ అమావాస్య శనివారం సాయంత్రం శ్రీవారి ప్రాకారోత్సవం కన్నుల వైభవంగా జరిగింది. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ నృసింహస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి శోభాయమానంగా తీర్చిదిద్దిన పల్లకీలో కొలువుదీర్చిన అనంతరం ప్రధానాలయం చుట్టూ ప్రదీక్షిణలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు కొండపైన శ్రీవారిని కొండకింద శ్రీ ఉధ్భవలక్ష్మి అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక ఆకు పూజలు నిర్వహించి తలనీలాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకోగా భక్తులకు ప్రసాదం పంపిణీ నిర్వహించారు. క్షేత్రం గుండా వెళ్లే నీటి జలపాతాలను తిలకించడానికిగాను జిల్లా నలుమూలలతోపాటు కర్నాటక ప్రాంతం నుండి వస్తున్న పర్యాటకులు వస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి కె.విజయ్‌కుమార్, ధర్మకర్తల మండలి ఛైర్మెన్ యం.అశోక్‌కుమార్, అర్చకులు గుండుస్వామి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పంటకోత ప్రయోగాలు పకడ్బందీగా నిర్వహించండి

**-శిక్షణా కార్యక్రమంలో డీవైఎస్‌ఓ తిరుమళాదేవి**



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీవైఎస్ఓ తిరుమళాదేవి

**ఉరవకొండ, ఆగస్టు 27 ప్రభాత వార్త :** పంటకోత ప్రయోగాలను జాగ్రత్తగా పకడ్బందీగా నిర్వహించాలని డీవైఎస్ఓ తిరుమళాదేవి సూచించారు. పట్టణంలోని స్థానిక మండల రెవిన్యూ కార్యాలయంలో శనివారం రైతు భరోసా కేంద్రాల సిబ్బంది, వీఆర్‌ఓలకు పంట కోత ప్రయోగాలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుమళాదేవి మాట్లాడుతూ తొలుత పంటకోత ప్రయోగాలను నిర్వహించే పంట పొలాన్ని ఎలా ఎంపిక చేసుకోవాలని, ఎంత వ్యాసార్థంలో పంటకోసి వాటి బరువు తూచాలి, రికార్డులో ఎలా నమోదు చేయాలన్న విషయాలను కులంకుశంగా వివరించారు. ఈ కార్యక్రమంలో మండల ఏఎస్‌ఓ హేమావతి, రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ మంజుల, మండల వ్యవసాయాధికారి శశికళ తదితరులు పాల్గొన్నారు.

## లంపి వ్యాధి నివారణకు టీకాలు

**డి.హిరేహాళ్ ఆగస్టు 27 ప్రభాతవార్త :** పశువుల్లో సోకే లంపి చర్మవ్యాధి నివారణకు ముందు జాగ్రత్తగా డి.హిరేహాళ్ పశువైద్యులు ముందస్తు చర్యలు చేపట్టి పశువులకు టీకాలు వేస్తున్నారు. సరిహద్దున ఉన్న కర్నాటక రాష్ట్రంలో పశువులకు ఈ వ్యాధి సోకి పాడి పశువుల్లో పాల ఉత్పత్తి తగ్గినట్లు పశువైద్యులు వివరిస్తున్నారు. ఈ నేపథ్యంలో డి.హిరేహాళ్ మండలం సోమలాపురం సర్పంచు శుదర్శనరెడ్డి తమ పంచాయతీ పరిధిలోని పాడి పశువులకు, లేగ దూడలకు, దుక్కిటెద్దులకు లంపి చర్మవ్యాధి నివారణ టీకాలు వేయించారు. అన్నదాతలు, పాడి రైతులు పశువులకు తక్షణం లంకి చర్మవ్యాధి టీకాలు వేయించి పశువులను రక్షించుకోవాలని సర్పంచు తెలిపారు. మండల పరిధిలోని తన తోటి సర్పంచిలందరు చొరవ తీసుకుని పశువులు లంపి చర్మవ్యాధి బారిన పడకుండ చర్యలు చేపట్టి వ్యాధి వల్ల జరిగే నష్టం పాడి రైతులు, అన్నదాతలకు వివరించి వారిని చైతన్యపరచాలని ఆయన తెలిపారు.



పశువులకు వ్యాధి నివారణ ముందస్తు టీకాలు

## హత్యాయత్నం కేసు నమోదుచేసి నిందితులను వెంటనే అరెస్టు చేయాలి

**-వెలిగొండ గ్రామంలో బాధిత దళిత కుటుంబాన్ని పరామర్శించిన జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు**



వెలిగొండ గ్రామంలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు. చిత్రంలో ఎస్ఐ వెంకటస్వామి తదితరులు

**ఉరవకొండ, ఆగస్టు 27 ప్రభాత వార్త :** మండల పరిధిలోని వెలిగొండ గ్రామంలో దళిత కుటుంబంపై దాడిచేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్‌తోపాటు హత్యాయత్నం కేసు నమోదుచేసి వెంటనే అరెస్టు చేయాలని జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు డా॥సి. తిరుపాల్, మోలక బాలరామాంజినేయులు తదితరులు డిమాండ్ చేశారు. శనివారం వారు వివిధ దళిత సంఘాల నాయకులతో కలిసి ఎస్ఐ వెంకట స్వామి, వీఆర్‌ఓల సమక్షంలో దాడికి గురైన బాధిత ఎన్నప్ప కుటుంబాన్ని పరామర్శించి నాటి దాడికి సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేఖరులతో వారుమాట్లాడుతూ ఘటనజరిగి వారం రోజులవు తున్నా ఇప్పటి వరకు నిందితులను అరెస్టు చేయలేదని వాపోయారు. ఎన్నప్ప కుటుంబానికి తగిన రక్షణ కల్పించాలని నిందితులను అరెస్టు చేయకపోతే పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఈమేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐకు వినతిపత్రం అందజేశా రు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ ఫోరం జిల్లా అధ్యక్షుడు నెరిమెట్ల ఎల్లన్న, ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు చంద్ర, రాజకీయ పోరాట సంఘం అధ్యక్షుడు రామాంజినేయులు, ఆయా సంఘాల నాయకులు మీనుగ రమేష్, ఎర్రిస్వామి, ఎల్లన్న, మధు, జగదీష్, ఆనంద్, గుర్రం రామాంజినేయులు, రాము, రామాంజినేయులు, ధనుంజయ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## సీఐ చిన్నగౌస్‌పై టీడీపీ నాయకులు దాడికి యత్నించడం దారుణం

**-తీవ్రంగా ఖండించిన ఉరవకొండ మైనార్టీ నాయకులు**



విలేఖరులతో మాట్లాడుతున్న మైనార్టీ నాయకులు

**ఉరవకొండ, ఆగస్టు 27 ప్రభాత వార్త :** రామగిరి సీఐ సయ్యద్ చిన్నగౌస్‌పై శ్రీ సత్యసాయి జిల్లా టీడీపీ అధ్యక్షుడు బి.కె.పార్థసారధి, మరికొందరు నాయ కులు దాడికి యత్నించడం దారుణమని ఉరవకొండ ముస్లీం మైనార్టీ నాయకులు వాపో యారు. పట్టణంలోని స్థానిక ఆర్‌అండ్‌బీ అతిధిగృహం ఆవరణంలో శనివా రం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మైనార్టీ నాయకులు కె.మైను ద్దీన్, యం.జిలాన్‌బాషా తదితరులు మాట్లాడుతూ రామగిరి మండలంలో టీడీపీ ఆందోళన నేపథ్యంలో బందోబస్తు నిర్వహిస్తున్న సీఐ చిన్నగౌస్ తన వృత్తి ధర్మాన్ని నిర్వహిస్తుండగా టీడీపీ నాయకులు వ్యక్తిగత దూషణలకుదిగి ఆవేశంతో ఊగిపోయి దాడికి యత్నించడం హార్హనీయమన్నారు. ముస్లీం మైనార్టీ అధికారిపై దాడులకు యత్నిస్తే సహించేదిలేదని సరైన రీతిలో బుద్ది చెబుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎ.జిలాన్, ఎ.శర్మస్, రహంతుల్లా, అమీన్, శిలార్ శర్మస్, ఎ.హసేన్‌బాషా, తోపుడ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## మానవ సేవకు ప్రతిరూపం "మధర్‌థెరిస్సా"



మదర్‌థెరిస్సా జయంతి వేడుకల సందర్భంగా నివాలులర్పిస్తున్న దృశ్యం

**కళ్యాణదుర్గం, ఆగస్టు 27 ప్రభాతవార్త :** సాటి మనిషికి సేవ చేయడం ద్వారా సేవాగుణం గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మదర్‌థెరిస్సా ఆశయాలను కొనసాగించేందుకు సమాజంలోని ప్రతి వ్యక్తీ నిన్నువలె నీ పక్కవాడిని ప్రేమించుమనే తత్వాన్ని అలవర్చుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక చల్లా కాంప్లెక్సులో మదర్‌థెరిస్సా మహిళా సంఘం అధ్యక్షురాలు సెలీనా చౌదరి అధ్యక్షతన ఏర్పాటు చేసిన మదర్‌థెరిస్సా 112వ జయంతి వేడుకల సందర్భంగా మదర్‌థెరిస్సా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న మున్సిపల్ కమీషనర్ వెంకటేశులు, ఉత్తమ సామాజిక సేవా అవార్డు గ్రహీత చల్లా కిశోర్‌కుమార్, జర్నలిస్టుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు లింగ ప్రసాద్(వార్త) తదితరులు ప్రసంగిస్తూ ఎక్కడో విదేశాల్లో జన్మించినా భారత దేశానికి వచ్చి సేవా కార్యక్రమాలతో మదర్ థెరిస్సాగా గుర్తింపు పొంది భారతరత్న,నోబుల్ అవార్డులు అందుకున్న మదర్‌థెరిస్సా సేవా గుణాన్ని సమాజంలోని అందరు అలవర్చుకుని సాటి మనిషికి సహాయం చేసేందుకు ముందుకు రావాలని, మానవత్వపు విలువలను చాటిచెప్పాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వినియోగదారుల జిల్లా సమాఖ్య ఉపాధ్యక్షులుగా రాజశేఖర్‌చౌదరి, ఫర్‌ద పీపుల్ చారిటబుల్‌ట్రస్ట్ ఛైర్మన్ డి.ఎన్.మూర్తి, బిఎస్ఎన్ఎల్ నారాయణ, రెవరెండ్ ఐజయ్య,జోసెఫ్‌కిశోర్, ఓబుళరాజు,తదితరులు పాల్గొన్నారు.

## అప్పుల బాధతో రైతు మృతి

**బెళుగుప్ప, ఆగస్టు 27 ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఎర్రగుడి గ్రామంలో రైతు అంజనేయులు (46) అప్పుల బాధతో మృతి చెందారు. భార్య సునీతి వివరాల మేరకు పొలం పనులకు వెళ్లి చెట్టు పీకుతుండగా శ్రుతితప్పి పడిపోయారు. పక్క పొలంలో ఉన్న రైతులు గమనించి భార్యకు తెలిపారు. వెంటనే అంబులెన్సులో కళ్యాణదుర్గం అర్‌డిటి అసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సలు పొందుతూ మృతి చెందారు. దీనికి కారణం 30 ఎకరాలు కౌలు, మరో 10 ఎకరాలు సాగు చేసేందుకు రూ.8 లక్షల అప్పులు ఉన్నాయని తెలిపారు. మానసిక వత్తిడి వల్ల మరణించాదని భార్య తెలిపారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు, కొడుకు ఉన్నారు. గ్రామంలో విషాధచాయలు అలుముకున్నాయి.

## సిఐఎఫ్‌టి ఛైర్మన్‌గా దాసరి భవాని

**గుత్తి, ఆగస్టు 27 ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ క్రైం ఇంటెలిజెన్స్ ఫోర్స్ ట్రస్ట్ గుత్తి మండల విభాగం ఛైర్మన్‌గా దాసరి భవానిని నియమించారు. ఈ మేరకు శనివారం రాష్ట్ర అధ్యక్షులు రాధా కృష్ణ ఆమె నియామక ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను మానవహక్కుల పరిరక్షణకు కృషి చేస్తానని ట్రస్ట్ నిబంధనల మేరకు విద్య, వైద్యం, మహిళా పిల్లల భద్రత, ఉపాధి, ఆరోగ్య ంపై దృష్టి సారించి బాధితులకు అండగా నిలుస్తామన్నారు. తన నియామకానికి సహకరించిన డైరెక్టర్ ఆనంద్‌కుమార్‌త్రిపాఠి, రాజనాల విశ్వనాథ్, అంజలిలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.



దాసరి భవాని

## వాలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

**విడపనకల్లు, ఆగస్టు 27 ప్రభాతవార్త) :** మండల కేంద్రంలో వివిధ కారణాల రీత్యా మూడు వాలంటీర్ పోస్టులు ఖాళీలు ఏర్పడ్డాయని అర్హులైన నిరుద్యోగ యువతి, యువకులు ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలంటూ శనివారం ఉదయం ఎంపిడిఓ ఏ. వి శ్రీనివాసులు తెలిపారు. వాలంటర్ పోస్టు ఖాళీలు వివరాలు విడపనకల్లు బి.సి జనరల్ -2 బిసి మహిళ -1 . పది పాసై ఉండాలి. వయస్సు 18 నుంచి 35 సంవత్సరాలులోపు ఉండాలి. ఆన్‌లైన్‌లో ఈనెల సెప్టెంబర్ 1 లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఓ తెలిపారు.

## ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రతిభాపురస్కారాలు

**- స్వాతంత్ర్య సమరయోధుల వారసులకు సన్మానాలు**
**- పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కల పంపిణీ**
**- ఫర్ ద పీపుల్ ట్రస్ట్ ఛైర్మన్ కాంచనగంగమూర్తి**



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న ఫర్ ద పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ డి.ఎన్.మూర్తి

**కళ్యాణదుర్గం ఆగస్టు 27 ప్రభాతవార్త :** ఫర్ ద పీపుల్ చారిట బుల్ ట్రస్ట్ అధ్వ ర్యంలో ఈనెల 28వ తేదిన ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రతిభా అవార్డులు, 75 సంవత్సరాల స్వాతంత్ర్య వజ్రోత్సవాల సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధులకు, వారసులకు సన్మానం, ప్రకృతి రక్షణ కోసం మొక్కల పంపిణీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ ఛైర్మన్ కాంచనగంగ, డి.ఎన్.మూర్తి పేర్కొన్నారు. స్థానిక శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ కళ్యాణమండపంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో అయన మాట్లాడుతూ పదవ తరగతి, ఇంటర్‌మీడియేట్ కోర్సుల్లో ప్రతిభావంతులైన వారందరికీ కుల,మతాలకు అతీతంగా విద్యార్థులకు, వారి తల్లితండ్రులను సన్మానించి ప్రతిభాపురస్కాలు అందజేసి, విద్యార్థుల్లో విద్యాసక్తులు కల్గించడంతో పాటు చదువుకుంటే తనతో పాటు తల్లితండ్రులకు వచ్చే గౌరవం పట్ల విద్యార్థుల్లో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా ఇటీవల కాలంలో పర్యావరణం సమతుల్యత లోపించిందని ప్రకృతి పరిరక్షించుకోవాల్సిన అవశ్యకతమై కూడా అవగాహన కల్పించేందుకు సమావేశానికి వచ్చిన వారందరికీ ఒక మొక్కను బహూకరించి చెట్లు పెంచాల్సిన బాధ్యతపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజలు,ప్రజాసంఘాలు, పుర ప్రముఖులు సహకరించాలని విజ్ఞప్తి చేసారు. ఈ సమావేశంలో పాల్గొన్న పెన్షనర్ల సంఘం అధ్యక్ష,కార్యదర్శులు శివప్రసాద్, తిప్పేస్వామి, వినియోగదారుల సంఘం అధ్యక్షలు కిశోర్‌కుమార్‌లు మాట్లాడుతూ విద్యార్థులకు ప్రతిభాపురస్కారాలు, స్వాతంత్ర్యోధమ స్ఫూర్తిని నింపేందుకు యోధుల కుటుంభ సభ్యులకు సన్మానాలు, ప్రకృతి పరిరక్షణ కోసం మొక్కల పెంపక కార్యక్రమాలను మేళవించి ఒకే వేదికపై బృహత్తర కార్యక్రమం నిర్వహిస్తున్న ఫర్ ద పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ కృషిని అభినందిస్తున్నట్లు పేర్కొన్నారు.

## వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

**గుత్తి, ఆగస్టు 27 ప్రభాతవార్త :** వినాయకచవితిని పురస్కరించుకుని గుత్తి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వినాయకుని విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తీసుకోవాలని అర్బన్ సిఐ వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఉత్సవ కమిటీ నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు. 5 మందితో కలిసిన కమిటీతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వుంటామన్న హామితో అఫిడవిట్ ఇవ్వాలన్నారు. లౌడ్ స్పీకర్లు వినియోగించరాదన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలని అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ మేరకు ప్రజలు సహకరించాలని ఆయన తెలియచేశారు.

## సంతానవరధునికి విశేషపూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

**గుంతకల్లు టౌన్, ఆగస్టు 27 ప్రభాతవార్త :** మద్దికెర మద్దమ్మ కుంటపై వెలసిన సంతానవరధుడు శ్రీసుబ్రమణ్యేశ్వర స్వామికి శనివారం అమావాస్య సందర్భంగా విశేషపూజలు, పంచామృతాభిషేకాలు, అర్చనలు, తదితర పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు విజయప్రసాద్‌యాదవ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## వినాయక చవితి ప్రశాంతంగా జరుపుకోండి



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై సునీత

**గుమ్మఘట్ట, ఆగస్టు 27 ప్రభాతవార్త**

వినాయక చవితి ప్రశాంత వాతావరణంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా జరుపుకోండని ఎస్సై సునీత పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని బేలోడు గ్రామంలో శనివారం పర్యటిస్తూ ప్రజలందరూ సంతోషంగా వినాయక చవితి ప్రశాంతంగా జరుపుకోవాలని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామస్తులకు సూచించారు.

## సంక్షేమ పథకాల ఫలితాల ప్రభావంతోనే సమాజ శ్రేయస్సు

**-దేశంలో అగ్రగామిగా నిలచిన వైసిపి ప్రభుత్వం -రాబోవు ఎన్నికలలో సంక్షేమ ఫలాలదే విజయబావుట- రాష్ట్ర స్త్రీశిశు సంక్షేమ శాఖా మంత్రి శ్రీమతి ఉషాశ్రీచరణ్**

**కుందుర్పి,ఆగస్టు,27,ప్రభాతవార్త:**



సంక్షేమ పథకాలను వివరిస్తున్న రాష్ట్రష స్త్రసీ శిశు సంక్షేమ శాఖా మంత్రి శ్రీమతి కె.వి ఉషాశ్రీచరణ్

అర్హులకు సంక్షేమ పథకాలు అమలులో మానవ కోణంలో మానవతా ధృక్పథంలో ప్రజాప్రతినితులు సచివాలయ సిబ్బంది.గ్రామ వార్డు వాలెంటీర్స్ అలోచించి పనిచెయ్యాలని గడప గడపకు కార్యక్రమంలో రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖా మంత్రి శ్రీమతి కె.వి ఉషాశ్రీచరణ్ పేర్కొన్నారు. గ్రామ గ్రామాన మంచి స్పందన,స్థానిక నాయకులు మండల పరిదిలోని నాయకులు సహాకారంతో బెస్తరపల్లి గ్రామంలో సంక్షేమపథకాలు మంత్రి ఇంటింటా వివరించగా ముఖ్య మంత్రి బీదల పట్లతీసుకుంటున్న నిర ్ణయాలకు కృతజ్ఞతలు తెలిపారు.ఇదే సందర్భంగా మంత్రి స్థానిక సమస్యలను కార్యకర్తలను ,నాయకులను అడిగి తెలుసుకున్నారు.మండల పరిదిలోని చాలారోడ్లకు మరమత్తులు అవసరమని ప్రయాణ సౌకార్యాలు అధ్వాన్నమని ,బెస్తరపల్లిటూ జంబుగుంపల గత75 సం,లుగా తారురోడ్డు ఏప్రభుత వ్ంవెయ్యలేదనీ కావున మనప్రభుత్వాంవేయించాలని జడ్పిటిసి బి,రాధాస్వామి మంత్రితో పేర్కొన్నారు.మంత్రివర్యులు సానుకూలంగా స్పందిచడంతో నాయకులు అనందం వ్యక్తపరిచారు. వీది దీపాలు డ్రైనేజీల శుభ్రత నీటిసమస్యలు తలెత్త కుండా వీధులు శుభ్రత చేయించడంలో సర్పంచులు కీలక మైన బాధ్యతలు కలగియుండాలని మంత్రి శ్రీమతి ఉషాశ్రీ చరణ్ పేర్కొన్నారు. సర్పంచులు ప్రస్తుతం జరిగిన పనులకు సంబందించి,బిల్లులు విషయంలో అసహానంవ్యక్త పరచగా తర్వలో బిల్లులు పూర్తీ చేయిస్తామని నాయకులతో సంప్రదించడం జరిగింది. పంట నష్టపరిహారం 2వ విడతరాలేదని రైతులు అవేదన వ్యక్తపరిచారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మమతధనుంజయ యంపిటిసి కవిత పేరెంట్సు కమిటి ఛైర్యన్ శంకర్ నాయకులు రవి తాతెప్ప యస్అర్ రామాంజినేయులు బొమ్మయ్య బిటిరాము జడ్పిటిసి బి రాధాసామి వైస్ యంపిపి బి జి సోమనాథ్ సింగల్ విండో అధ్యక్షులు ఏఅర్ వన్నూర్‌రెడ్డి రాష్ట్రవాల్మీ సంఘం డైరక్టర్ పాలాక్షి మండల కన్వీనర్ సత్యనారాయణశాస్త్రి మండల పరిదిలోని సర్పంచులు యంపిటిసీలు వైసిపి నాయకులు సచివాలయ సిబ్బంది వాలెంటీర్స్‌పాల్గొన్నారు.

## జైహనుమా జై..జైహనుమా

**డి.హిరేహాళ్ ఆగస్టు 27 ప్రభాతవార్త**

**జైహనుమా జైజైహనుమా అంజనీపుత్ర వీరాంజనేయా మము రక్షించుమా అంటు భక్తులు ఆంజనేయ నామ స్మరణం స్మరించారు.**



డి.హిరేహాళ్ మండలం మురడి గ్రామంలో భక్తుల నోట ఆంజనేయ స్వామి నామస్మరణం మారుమోగింది. చివరి శ్రావణ శనివారంను పురస్కరించుకుని భక్తులు జిల్లాలో నిపలు ప్రాంతాల నుండి తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకు న్నారు. ఉదయం నుంచే భక్తులు స్వామివారి దర్శనం కోసం బారులు తీరి భక్తి శ్రద్దలతో ప్రత్యేక పూజలు చేయించారు. ఈ నేపథ్యంలో అర్చుకులు వేకువ జామునే స్వామివారికి సుప్రభాత సేవ అనంతరం మూలవిరాట్ ఆంజనేయ స్వామివారిని ప్రత్యేకం గా అలంకరించారు. స్వామివారికి



స్వామివారి దర్శనంలో భక్తులు రద్దీ

అర్చకులు విసేషపుష్పాలంకరణ, ఆకుపూజ తదితర పూజల అనంతరం మహామంగళారతి గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచారు. అనంతంరం భక్తులు స్వామివారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు చేయించి సా ్వమివారికి మొక్కులు తీర్చుకున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచే కాకుండా సరిహద్దున ఉన్న కర్నాటక ప్రాంతం నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శింశుచుకుని కానుకలు సమర్పించి స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారి ఆలయ ప్రాంగణంలో రాయదుర్గం పట్టణానికి చెందిన ఆర్.ఎం. వైద్యులు హనుమంతరెడ్డి స్వామివారి భక్తులకు ఉచిత వైద్య సేవలు అందించారు.

## శ్రావణమాసం ఆఖరి శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు



**బొమ్మనహాళ్, ఆగస్టు 27 ప్రభాతవార్త**

మండల పరిధిలోని నేమకల్లు గ్రామంలో వెలిసిన పవిత్ర పుణ్యక్షేత్రమైన ఆంజినేయస్వామి ఆలయంలో శ్రావణమాసం ఆఖరి శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు అనిల్‌స్వామి తెలిపారు. స్వామివారికి వెండి కవచం, సువర్ణకిరీటం, ఆకుపూజ, హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ఇవో శ్రీనివాసులు తెలిపారు. శ్రావణమాసం ఆఖరి శనివారం కావడం వల్ల కర్నాటక నుంచి భక్తులు భారీగా తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నట్లు తెలిపారు. దర్శనార్థం వచ్చిన భక్తాదులకు కర్నాటక, బళ్లారి జిల్లా మూలమనే వెంకటప్ప, లక్ష్మమ్మ వారి కుటుంబ సభ్యులు ఉచిత అన్నదానం ఏర్పాటు చేసినట్లు అన్నదాన కమిటీ ఛైర్మన్ రామాంజినేయులు తెలిపారు. ఆలయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలో చోటు చేసుకోకుండా రాయదుర్గం రూరల్ సిఐ యుగంధర్ ఆధ్వర్యంలో గట్టి బంధోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్సై శివ తెలిపారు. భక్తులకు మౌలిక సదుపాయాలు, వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు గ్రామ సర్పంచు పరమేశ్వర తెలిపారు.

## కోరం లేకుండానే మున్సిపల్ సాదారణ సర్వసభ్య సమావేశం

**-చైర్మన్ మినమా పురుష కౌన్సిలర్లందరూ గైర్హాజరే**
**-చర్చించకుండానే అజెండా అమోదం**



మున్సిపల్ సాదారణ సర్వసభ్య సమావేశంలో ప్రసంగిస్తున్న కమీషనర్ వెంకటేశులు



హాజరైన మహిళా కౌన్సిలర్లు

**కళ్యాణదుర్గం, ఆగస్టు 27 ప్రభాతవార్త**

కళ్యాణదుర్గం మున్సిపాలిటీలో శనివారం ఛైర్మన్ రాజ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సాదారణ సర్వసభ్య సమావేశంలో కేవలం ఐదు మంది మాత్రమే మహిళా కౌన్సిలర్లు ప్రత్యక్షంగా హాజరుకాగా, కోరం లేకుండానే సమావేశం సాగింది. ఈ సందర్భంగా మున్సిపల్ కమీషనర్ వెంకటేశులు మాట్లాడుతూ మున్సిపాలిటీలో 24 మంది కౌన్సిలర్లు, మరో ఇద్దరు కో-అప్షన్ సభ్యులుండగా గడప,గడపకు ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొనేందుకు మంత్రి ఉషశ్రీచరణ్ వెంట వెళుతున్న ఎమినిది మంది కౌన్సిలర్లు ముందుగానే అజెండా చదువుకుని సంతకాలు చేసి వెళ్లారని,ఛైర్మన్‌తో పాటు హాజరైన ఐదు మంది మహిళా కౌన్సిలర్లను కలుసుకుని 14 మంది హాజరు అయినట్లే భావించి సాదారణ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన 15వ అర్థిక సంఘం నిధులను మున్సిపాలిటీలోని 24 వార్డులకు సమానంగా ఒకటి,రెండు వార్డులు మినహాయించి అన్ని వార్డులకు రూ.4,70లక్షల నిధులు కేటాయించి అయా వార్డుల్లో డ్రైనేజీలు, సిసిరోడ్లు ప్రతిపాధించినందున కొందరు కౌన్సిలర్లు సంతృప్తిని వ్యక్తం చేసి, సంతకాలు చేసి వెళ్లారని, కనుక వారు కూడా హాజరు అయినట్లే భావిస్తే 14 మంది హాజరు అయినట్లు సమావేశం నిర్వహించినట్లు వివరించారు. దీనికితోడు మంజూరు అయిన 15వ అర్థిక సంఘం నిధులకు కౌన్సిల్ అమోదం పొందకపోతే వాపసు వెళ్లే ప్రమాదంతో పాటు జాప్యం నివారించేందుకు కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించినట్లు వివరించారు. అలాగే వన్‌టైం విద్యుత్ బకాయిల చెల్లించేందుకు రూ.11.41లక్షలు,ఐ.ఇ.సి యాక్టివిటీస్, కెపాసిటీ బిల్డింగ్‌కు రూ.1.26563ల చొప్పున ప్రతిపాదించారు. అలాగే టైడ్ గ్రాంట్ ద్వారా నీటిసరఫరా,సాలిడ్ మేనేజ్‌మెంటు తదితరాలకు రూ1.90 కోట్లకు ప్రతిపాదించారు. ఇలాంటి పలు అంశాలతో కూడిన అజెండాను ఎలాంటి చర్చలేకుండానే అజెండాచదివి అమోదించినట్లు ప్రకటిం చారు. ఈ కార్యక్రమంలో డిఇఇ సురేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలపై ప్రజలు వంద శాతం సంతృప్తి

- చేసిందే ప్రజలకు ధైర్యంగా చెబుతున్నాం - రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి
- వేపచెర్ల, దిగువ తాండాలో "గడప-గడపకూ మన ప్రభుత్వం..



గడప-గడపకూ మనప్రభుత్వం నిర్వహిస్తున్న రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి,జడ్,పి చైర్మెన్ బోయ గిరిజమ్మ

**ఆత్మకూరు ఆగస్టు 27 ప్రభాతవార్త**

వైఎస్ఆర్ ప్రభుత్వం ప్రజలకు ఏమిచెప్పిందో వాటిని వందశాతం ప్రజలకు చేశామని,ప్రభుత్వం ఏం చేసిందో అదే ప్రజలకు ధైర్యంగా చేప్పే అవకాశంను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తమకు కల్పించారని రాప్తాడు నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి పేర్కోనా న్నరు. శనివారం ఆత్మకూరు మండలం వేపచెర్ల ఎగువ తాండా గ్రామంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మతో కలసి ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి 'గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంచేపట్టారు. ఎమ్మెల్యే, కార్యకర్తలు, వాలంటీర్ల,సచివాలయం సిబ్బంది, అధికారులతో కలసి ఇంటింటా తిరిగి మూడేళ్ళలో ప్రభుత్వం చేసినసాయా న్ని వివరిస్తూ లబ్ధిపత్రాలును అందజేశారు.ప్రతిఇంటి వద్ద మహిళలు ఎమ్మెల్యేను అప్యాయంగా పలకరించా రు. ప్రతి కుటుంబం ఏదో ఒక్క పథకంద్వారా లబ్ధి పొందిందని మహిళలు పేర్కో న్నారు. ఎవ్వరి ప్రమేయం లేకుండానేరుగా మా బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నారన్నారు.అకౌంట్లలో డబ్బులు జమచేయడం ఏ ప్రభుత్వం చూడలేదన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ప్రభుత్వం నుంచి సాయం పొందామని మహిళలు వివరించారు. ఇల్లాంటి ముఖ్య మంత్రి కలకాలం ఉండాలని కోరారు. వైఎస్ జగన్మోహ న్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఎస్సీ,ఎస్టీ, బీసి,మైనార్టీ వర్గాల్లో వెలుగు నింపారన్నారు.కలల్లో కూడా ఊహిం చని విధంగా వారి అభివృద్ధికి బాటలు వేస్తున్నారన్నా రు.గత తెలుగుదేశంప్రభుత్వం హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో దోచుకున్నారన్నారు. జన్మభూమి కమిటీలు సిఫార్సు చేసిన వారికే పథకాలు దక్కేవన్నా రు.జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత పార్టీ లకు అతీతంగా కులాలు,మతాలకు అతీతం గా సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు.ఈ కార్యక్రమంలో యంపిపి హేమలత,వైస్‌యంపిపి నీలిమ,మాజీకన్వీనర్ బాలపోతన్న,నరసింహరెడ్డి, ఫణిరెడ్డి,అతికిరెడ్డి, వాసుదే వారెడ్డి,గూలి కొండారెడ్డి,శ్రీ సుబ్రమనేశ్వర స్వామి ఆలయం కమిటీ చైర్మెన్ డి,చంద్రశేఖర్‌రెడ్డి యంపిటిసి లు,సర్పంచ్‌లు, డైరెక్టర్లు, కార్యకర్తలు, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గోన్నారు.

# నూతన హంగులతో పూర్తయిన ఎంపిడిఓ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

**కదిరి టౌన్, ఆగస్టు 27, ప్రభాతవార్త :**

కదిరి మండల పరిషత్ కార్యాలయం ఆధునీకరణ పనులు పూర్తిఅయి నూతన హంగులతో రూపుదిద్దుకున్న భవన సముదాయాలను శనివారం కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్దారెడ్డి చేతులు మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల అధ్యక్షుడు తోట అమర్నాథ్‌రెడ్డి భవనాలను నూతన హంగులతో తీర్చిదిద్దినందుకు ప్రత్యేకంగా అభినందిస్తున్నానన్నారు. కార్యాలయానికి వచ్చే ప్రజలకు మంచి వసతులు కల్పించి వారి సమస్యలను సవివరంగా విని పరిష్కరించి పంపాలని సూచించారు. మండల అభివృద్ధికి ప్రతి ఒక్క ప్రజా ప్రతినిధి తనవంతు తోడ్పాటు అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి రాధాబాయి, ఎంపిడిఓ సుధామణి, డిఎల్‌పిఓ అంజనప్ప, వైస్ ఎంపిపి ఆనంద్‌నాయక్, కన్వీనర్ ప్రకాష్‌తో పాటు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

# హిందూపురంలో పోటీ చేస్తాననే ప్రచారం అవాస్తవం-మంత్రి ఉష శ్రీచరణ్

-కళ్యాణదుర్గం నియోజకవర్గాన్ని వదలివెళ్లే ప్రశ్నే లేదు



రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి ఉషశ్రీచరణ్

**కళ్యాణదుర్గం, ఆగస్టు 27 ప్రభాతవార్త**

హిందూపురం నుండి ఎంపిగా గోరంట్ల మాధవ్ స్థానంలో పోటీ చేస్తానని సోషియల్ మీడియాలో ఇచ్చిన వార్తలు అవాస్తవని, నన్ను అదరించి, మంత్రి పదవివచ్చేందుకు అశీర్వదించిన కళ్యాణదుర్గం నియోజకవర్గాని , ప్రజలను వదలివెళ్లే ప్రశ్నే లేదని రాష్ట్ర స్త్రీ,శిశు సంక్షేమశాఖ మంత్రి ఉషశ్రీచరణ్ స్పష్టం చేసారు. గత కొంతకాలంగా గోరంట్ల మాధవ్‌పై వచ్చిన అరోపణల నేపథ్యంలో అదే సామాజికి వర్గానికి చెందిన మంత్రి ఉషశ్రీచరణ్, పలు బాషలు అనర్గళంగా మాట్లాడతారన్న నేపథ్యంలో హిందూపురం పార్లమెంటు అభ్యర్థిగా పోటీ చేయించేందుకు కసరత్తు సాగుతోందని వచ్చిన వార్తలను అమె ఖండించారు. మండల పరిధిలోని మానిరేవు గ్రామంలో పాల్గొన్న ఒక కార్యక్రమంలో అమె ప్రసంగిస్తూ ప్రజలకు ఉన్న అనుమానాలను నివృత్తి చేసేందుకు తాను కళ్యాణదుర్గంలోనే ఉంటానని స్పష్టం చేసారు.గత ఎన్నికల్లో ప్రతి ఇంటిలోనూ అడపడచుగా భావించి ఎన్నికల్లో అపూర్వ విజయాన్ని అందించిన ప్రజలను ఎప్పటికీ మరువలేనని, అంతేకాకుండా తనకు తొలి ప్రభుత్వ పాలనలోనే మంత్రి పదవి రావడానికి కళ్యాణదుర్గం ప్రాంత ప్రజల అశీస్సులే కారణమన్నారు. తాను హిందూపురం వెళతానని వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని అమె హార్షధ్వానాల మద్య పేర్కొన్నారు.

# ప్రజల సమస్యల పరిష్కారం కోసమే గడప గడపకు మన ప్రభుత్వం





గజమాలతో ఎంఎల్‌ఎకు స్వాగతం పలుకుతున్న సర్పంచ్ శ్రీనాథ్‌రెడ్డి , లబ్దిదారులకు సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

**నల్లచెరువు, ఆగస్టు 27, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని అల్లుగుండు గ్రామ పంచాయతీ పరిధిలోని జోగన్నపేట పంచాయతీ బొమ్మిరెడ్డిపల్లి, జోగన్నపేట, చిన్నయల్లంపల్లి గ్రామాలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్దారెడ్డి పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు పలు శాఖల అధికారులు, నాయకులు కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివా రం నిర్వహించారు. మొదటగా ఎమ్మెల్యే సిద్దారెడ్డికి మండల ఎంపిపి రమణారెడ్డి, జోగన్నపేట గ్రామ సర్పంచ్ శ్రీనాథ్‌రెడ్డి, పార్టీ నాయకులు సగౌరవంగా ఆహ్వానించి, యాపిల్ పండ్లతో తయారు చేసిన గజమాలతో సత్కరిం చి ఘనంగా స్వాగతం పలికారు. మొదటగా ఎమ్మెల్యే గ్రామ సత్యమ్మ దేవత వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కార్యక్రమా న్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే సిద్దారెడ్డి గడప గడపకు తిరుగుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రజల సమస్యలను తెలుసుకొని అక్కడికక్కడే పరిష్కరించే విధంగా అధికారు లతో మాట్లాడి చర్చించారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే దృష్టికి దివ్య, తండ్రి వెంకటస్వామి జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్న పాఠశాల నల్లచెరువు నందు చదువుతున్నదని అమ్మఒడి రాలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఎంఈఓతో మాట్లాడి దానికి గల కారణాలు కొనుక్కొని, అమ్మఒడి వచ్చే విధంగా చూడాలని ఆదేశించారు. గంగులమ్మకు చేయూత అందలేదని అడగగా సంబంధిత అధికారితో మాట్లాడగా గంగులమ్మ అనే పేరు ఇరువురు ఉన్నారని ఈమెకు వచ్చే మొత్తం అదే పేరుగల ఇంకో గంగులమ్మ పేరు మీదల వస్తున్నదని తెలుపుగా వెంటనే సవరించి ఆమెకు చేయూత అందే విధంగా చూడాలని ఆదేశించారు. సిసి రోడ్లు వేయకుండా మిగిలిపోయిన రోడ్లకు నూతన సిసి రోడ్లు వేయించాలని ఇంజనీర్‌ను ఆదేశించారు. వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూ రు చేయించాలని కొందరు ఎమ్మెల్యేను కోరగా ఎంపిడిఓతో మాట్లాడి మరుగుదొడ్ల డ్రైనేజీలు నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పొజిషన్ సర్టిఫికేట్స్ లేనివారికి విఆర్‌ఓతో మాట్లాడి పొజిషన్ సర్టిఫికెట్‌లు పంపిణీ చేయాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నేడు జోగన్నపేట పంచాయతీ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించడం జరుగుతున్నదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలోనూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతున్న దని, ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు ఎంతో లబ్ధి చేకూరుతుందని, చిన్న చిన్న సమస్యలను కూడా అధికారులు దృష్టికి తీసుకుపోలేనటువంటి వారు చాలా మంది ఉన్నారనీ, వారికి ఇది ఒక మంచి వేధిక అన్నారు. జగనన్న అనేకమైన సంక్షేమ పథకాలను తీసుకువచ్చి ప్రజలకు మంచి మేలు చేసే కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఇలాంటి జనరంజకమైన పాలనను చేపట్టిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలందరి తరుపున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి నారాయణస్వామి, సర్పంచ్‌లు యూసఫ్, రమణారెడ్డి, కృష్ణారెడ్డి, హైటెక్ రమణ, ఎంపిటిసిలు రమణారెడ్డి, రఫీ, సింగిల్ విండో అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, టెంపుల్ చైర్మెన్ ఆనంద్‌రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ ఆదిమూర్తి, చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు విశ్వనాథరెడ్డి, రవికుమార్‌రెడ్డి, శ్రీక ంఠరెడ్డి, మైనార్టీ నాయకులు నజీర్, హరినాథ్‌రెడ్డి, బట్టి హైదర్‌వలి, హరినాథ్‌రెడ్డి, రాజశేఖర్, కరీముల్లా, మధుసూధన్‌రెడ్డి, ఎల్‌ఐసి శ్రీనా, నరసింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రవి, ఆర్మీ నరసింహారెడ్డి, టెలికాం నరసింహారెడ్డి, కృష్ణమూర్తి, శ్రీరాములు, అక్కుల్‌రెడ్డి, సాంబశివ, రామప్ప, రాము, నరసింహులు, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది , వాలంటీర్‌లు మరియు వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీసత్యసాయి ప్రశాంతి నిలయం-రాజమండ్రి ప్రత్యేక రైలు కేటాయించండి



రైల్వే జిఎంను సన్మానిస్తున్న దృశ్యం

**శ్రీసత్యసాయిజిల్లా, ఆగస్టు 27, ప్రభాతవార్త ప్రతినిధి:**

శ్రీసత్యసాయి ప్రశాంతి నిలయం నుండి రాజమండ్రికి ప్రత్యేక రైలు కేటాయించాలని దక్షిణమధ్య రైల్వే బోర్డ్ కమిటీ మెంబర్ జి.సురేష్‌కుమార్ కోరారు. శుక్రవారం సికిందరాబాద్‌లో జరిగిన రైల్వే ఆఫీసర్స్ క్లబ్ 74వ జడ్ఆర్‌యుసిసి బోర్డు సమావేశంను దక్షిణ మధ్య రైల్వే జిఎం అధ్యక్షతన నిర్వహించగా, దక్షిణ మధ్య రైల్వే సభ్యులు అందరూ వివిధ అంశాలపై వినియోగదారులకు సేవలు అందించే విధంగా పలు సూచనలు ఇవ్వడం జరిగిందని ఆయన తెలియజేవారు. ఇందులో భాగంగా తాను ధర్మవరం మరియు అనంతపురం రైల్వే స్టేషన్ నందు లిఫ్ట్‌లను ఏర్పాటు చేయాలని వినియోగదారులకు తగిన సేవలు అందించేందుకు ప్రతి రైల్వే స్టేషన్ నందు ఒక కంప్లైంట్ నెంబర్ ఏర్పాటు చేసి పర్యవేక్షణ అధికారిని నియమించాలని తెలియజేశారు. గత దశాబ్దకాలంగా మచిలీపట్నం, కొండవీడు, యశ్వంతపూర్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రతి రోజూ నడిచే విధంగా చూడాలని, అందువల్ల విజయవాడకు వెళ్ళే ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా ఉంటుందని కోరడం జరిగిందన్నారు. మరియు విజయవాడ నుండి ధర్మవరం వచ్చు ట్రైన్‌లను శ్రీసత్యసాయి ప్రశాంతి నిలయం రైల్వే స్టేషన్ వరకు పొడగించాలని కోరినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిజిఎం మరియు రైల్వే సిబ్బందితో పాటు ఆరు డివిజన్లకు చెందిన జోనల్ సభ్యులందరూ పాల్గొనాలన్నారు. అనంతరం రైల్వే జిఎంను సురేష్ కుమార్ మరియు ఎన్ఆర్ఇసిసి మెంబర్ గంగాధర్‌రావు, సభ్యులతో పాటు దుశ్శాలువతో ఘనంగా సత్కరించినట్లు తెలియజేశారు.

# విగ్రహం ఏర్పాటు కార్యక్రమానికి ఎమ్మెల్యే, జె.సికి ఆహ్వానం





ఎమ్మెల్యే కేతిరెడ్డిని ఆహ్వానిస్తున్న దృశ్యం ,మున్సిపల్‌చైర్మన్ జె.సిని ఆహ్వానిస్తున్న దృశ్యం

**తాడిపత్రిటౌన్, ఆగస్టు 27 ప్రభాతవార్త**

వినాయకచవితి పండుగను పురస్కరించుకుని పట్టణంలోని గాంధీకట్ట వద్ద శ్రీవినాయక ఉత్సవ కేంద్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 31వతేదీన ఏర్పాటు చేయనున్న వినాయక విగ్రహం ఏర్పాటు కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరు కావాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డితో పాటు మున్సిపల్‌చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి, డిఎస్‌పి విఎన్‌కె చైతన్యలకు శ్రీవినాయక ఉత్సవ కేంద్ర కమిటీ వారు ఆహ్వానపత్రికలు అందచేసి ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో శ్రీవినాయక ఉత్సవ కేంద్ర కమిటీ అధ్యక్ష, కార్యదర్శ, సభ్యులు కత్తి రామచంద్రారెడ్డి, జయప్ప, సింగరి శ్రీరంగయ్య, సింగరి లక్ష్మీనారాయణ, వేణుగోపాలరావు, బిజెపి ప్రతాప్‌రెడ్డి, ఆంజనేయులు, గణేష్, కుల్లూరు శేషఫణి, లక్ష్మీనరసింహులు, రామసుబ్రమణ్యం, మధుసూదన్‌గుప్తా, నాగార్జునరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, నారాయణరెడ్డి, జయరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ఆటవిక పాలన కొనసాగుతోంది

- రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ నిరంకుశ వైఖరి - ప్రతిపక్ష నేతలను టార్గెట్ చేస్తూ దాడులు
- అరాచకపాలనకు ప్రజలు చరమగీతం పాడాలి - మీడియా సమావేశంలో ధ్వజమెత్తిన పల్లె

**ఓబుళదేవరచెరువు, ఆగస్టు 27, ప్రభాతవార్త :**

ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రంలో ఆటవిక పాలన కొనసాగిస్తున్నారని ఆతని పరిపాలన మృగయా వినోదాన్ని తలపిస్తోందని మాజీ మంత్రి, టిడిపి పుట్టపర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పల్లె రఘునాథరెడ్డి ధ్వజమెత్తారు. మూడేళ్ల పరిపాలనలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని విస్మరించి ప్రతిపక్ష నేతలను టార్గెట్ చేయడమే లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తున్నాడని విమర్శించారు. పోలీస్ వ్యవస్థ ప్రజలకు నమ్మకం కలిగించి విస్వాసంగా పనిచేయాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా ప్రజల పక్షాన పోరాడుతున్న ప్రతిపక్ష నేతలపై విరుచుకుపడ్డం సమంజసమేనానని సూటిగా ప్రశ్నించారు. ఇటీవల కాలంలో టిడిపి అధినేత చంద్రబాబు కుప్పంలో అన్నా క్యాంటీన్ ప్రారంభిస్తున్న నేపథ్యంలో వైసిపి నాయకులు, కార్యకర్తలతోపాటు పోలీసులు సైతం అడ్డుకోవడం రాష్ట్ర ప్రజలందరూ గమనించాల్సిన అవసరం ఉందన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో సత్యసాయి జిలా టిడిపి అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పార్థసారధి, మాజీ మంత్రి పరిటాల సునిత, శ్రీరామ్‌లతో పాటు కదిరి మాజీ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ లాంటి ముఖ్యనాయకులపై కూడా పోలీసు అధికారులు నిరంకుశంగా అధికార పార్టీకి కొమ్ముకాసేవిధంగా వ్యవహరించి ప్రజా స్వామ్యాన్ని ఖూనీ చేశారన్నారు. ముఖ్యంగా రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమ పథకాలు కేవలం అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లోనే వారి వర్గాలకు చేరుతున్నాయి తప్ప నిరుపేదలకు రిక్తహస్తం చూపిస్తున్న సంగతి ప్రజలు ఒ కంట కనిపెడుతున్నారన్నారు. లేపాక్షి నాలెడ్జ్ హబ్ పేరిట నిరుపేద రైతులకు చెందిన భూములను అప్పనంగా కాజేశారన్నారు. ఆ భూములనే తనఖా పెట్టి రూ 300 కోట్లను దండుకున్న సంగతి జగమెరిగిన సత్యం అన్నారు. తీరా బ్యాంకు ఉన్నతాధికారులు ఆ భూములను వేలం వేస్తే కారుచౌకగా కేవలం రూ 500 కోట్లకు మాత్రమే దక్కించుకుని నేడు రైతుల కడుపులు కొట్టడం ఎంతవరకూ సమంజసమో వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. రూ 4 వేల కోట్లు విలువచేసే భూములను అధినేత బంధవులు అప్పనంగా దోచుకోవడం రాష్ట్ర ప్రజలందరికి తెలిసిన సత్యం అన్నారు. అధికార పార్టీ నేతలందరూ రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు భూములపై కన్నేసి వేలాది కోట్ల రూపాయలను దండుకోవడం ఎంతవరకూ సముచితమో శ్వేతప్రతం విడుదల చేయాలని పల్లె స్పష్టం చేశారు. ఈ అరాచక పాలనకు రాష్ట్ర ప్రజలే తగిన గుణపాఠం చెప్పి గద్దెదింపే రోజులు దగ్గరే ఉన్నాయన్న సంగతి మరవకూడదనా న్నరు. సమావేశంలో



ప్రధాన కార్యదర్శి పీట్ల సుధాకర్, టిడిపి నాయకులు ఆర్‌ఎంపి డాక్టర్ జాకీర్, బడిశం రామాంజినేయులు, సన్నగాళ్ల గంగాద్రి, మండోజి ఆరీఫ్‌ఖాన్, ఇర్షాద్, రమణారెడ్డి, క్రిష్ణమూర్తి, రాయల్ కుమార్, హనుమంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణాలపై అలసత్వం తగదు

- భవనాల నిర్మాణంపై అధికారులు సీరియస్‌గా దృష్టి పెట్టాలి - యాక్షన్‌ప్లాన్ తయారు చేసి చెప్పిన సమయానికి నిర్మాణాలు పూర్తి చేయాలి - జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి





ఎటిపి08 : మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి, హాజరైన పంచాయితీ రాజ్ శాఖ ఇఇలు, డిఇలు, ఏఈలు

**అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 27 ప్రభాతవార్త**

ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న గ్రామ సచివాయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్ఆర్ హెల్త్ క్లీనిక్స్, బల్క్‌మిల్క్ కూలింగ్ యూనిట్స్ తదితర ప్రభుత్వ శాశ్విత భవన నిర్మాణాలపై అలసత్వం వీడి ప్రతి భవనంలో పని జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో పంచాయితీ రాజ్ శాఖ ఇఇలు, డిఇలు, ఏఈలతో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్ఆర్ హెల్త్ క్లీనిక్, బల్క్‌మిల్క్ కూలింగ్ యూనిట్ తదితర ప్రభుత్వ శాశ్వత భవన నిర్మాణాలు పురోగతిపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్ఆర్ హెల్త్ క్లీనిక్స్, బల్క్‌మిల్క్ కూలింగ్ యూనిట్స్ భవనాల నిర్మాణంపై పురోగతి సక్రమంగా లేదని, వెంటనే భవనాల నిర్మాణంపై అధికారులు సీరియస్‌గా దృష్టి పెట్టాలన్నారు. గ్రామ సచివాయాలకు సంబంధించి 470 భవనాల్లో 265 పూర్తి చేయడం జరిగిందని, మిగతా భవనాలు వేగవంతంగా చేపట్టాలన్నారు. ఈ ఏడాది జూన్ 1 నుంచి ఆగస్టు 26 వ తేది వరకు ఆయా భవన నిర్మాణాలకు సంబంధించి 156భవనాల్లో ఒక్క స్టేజి అప్‌డేషన్ కూడా జరగలేదన్నారు. ఈ విషయమై మండల స్పెషల్ ఆఫీసర్, ఎంపిడిఓ, ఇంజినీరింగ్ అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సమావేశం నిర్వహించి సంబంధిత కాంట్రాక్టర్లతో మాట్లాడి పనులు జరిగేలా చూడాలన్నారు. వచ్చే వారంలోగా నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్లు స్థానిక ప్రజా ప్రతినిధులతో మాట్లాడి ప్రతిభవనం నిర్మాణంలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.

# బోయ అమరేంద్రపై జరిగిన దాడిని ఖండిస్తున్న తెదేపా నాయకులు



బోయలపై జరిగిన దాడిని ఖండిస్తున్న బోయనాయకులు

**ఆత్మకూరు ఆగస్టు 27 ప్రభాతవార్త**

మాజీ యంపిపి బోయ అమరేంద్రపై దాడిచేసిన తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డిపైతక్షణమే కేసు నమోదుచేసి, అరెస్టు చేయాలని తెదేపా నాయకులు డిమాండ్ చేశారు.బోయలపై జరిగిన దాడిని నిరసిస్తూ ఆత్మకూరు లో తెదేపా నాయకులుఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశం తెదేపా మండల కన్వీనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ చేన్నేకొత్తపల్లి మాజీ యంపిపి అమరేంద్రపై దాడిచేసి, బోయి కులస్తులుపై చులకనగా చేసి మాట్లాడిన తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి తస్మాత్ జాగ్రత్త అంటూ కన్వీనర్ శ్రీనివాసులు హెచ్చరించారు.చేన్నేకొత్తపల్లి చెందిన కొంతమంది వైఎస్ఆర్ కార్యకర్తలు,నాయకులు తెలుగుదేశం పార్టీలోకి చేరాలని వెంకటాపురంకు వెళ్తాండుగా కుంటిమద్ది చెరువు కట్ట దగ్గర ముందే కాచుకున్నరాప్తాడు ఎంఎల్‌ఏ ప్రకాష్‌రెడ్డి సోదరుడు రాజశేకర్‌రెడ్డి, అతని అనుచరులు వెంకటాపు రంవెళ్ళు తున్న వారిని కులం పేరుతో దూషించి ఇష్టానుసారంగా దాడిచేయడం తీవ్రంగా ఖండిస్తూ న్నామన్నారు. గ్రామాల్లో కులాలు మధ్య చిచ్చుపెడుతూ గొడవలు సృష్టిస్తు అధికారం ఉందని తెలుగుదేశం నాయకులుపై అక్రమంగా కేసులు పెటితే మీకు భయపడే ప్రసక్తేలేదన్నారు.బోయ కుల ఓట్లతో గెలిసి,బోయలపైనే దాడులుచేస్తారని ఆవేదన వ్యక్తంచేశారు.వచ్చే ఎన్నికల్లో మీకు తగిన గుణపాఠం చేప్పడానికి సిద్దంగా ఉన్నామని హెచ్చరించారు.ఈ సమావేశంలో రాప్తాడు నియోజవర్గ బీసీ ఉపాధ్యక్షుడు రాజారమేష్,తెలుగు యువత మండల ఉపాధ్యక్షుడు అంకె ఆనంద్,మాజీ కన్వీనర్ల్ మనోరంజన్, వెంకటరాముడు,హిందుపురం పార్లమెంట్ అధికార ప్రతినిధి మహిళ నాయకరాలు పెద్దలక్ష్మక్క, మాజీ స్కూల్ కమిటీ చైర్మెన్ కందుల ఓబుళపతి,తెదేపా నాయకులు రాందాసు,అక్కులప్ప,ఆదెప్ప, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ లక్ష్మినరసింహస్వామిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి

-ఆలయ మర్యాదలతో స్వాగతం పలికిన ఈఓ, ఛైర్మెన్



హైకోర్టు న్యాయమూర్తి బి.శ్యాంసుందర్‌కు శ్రీవారి చిత్రపటాన్ని అందిస్తున్న ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ యం.అశోక్‌కుమార్, ఈఓ కె.విజయ్‌కుమార్

**ఉరవకొండ, ఆగస్టు 27 ప్రభాతవార్త**

మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళం శ్రీ లక్ష్మినరసింహస్వామిను శనివారం సాయంత్రం హైకోర్టు న్యాయమూర్తి బి.శ్యాంసుందర్ దర్శించుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి చేరుకోగానే ఆలయ కార్యనిర్వహణ అధికారి కె.విజయ్‌కుమార్, ధర్మకర్తల మండలి ఛైర్మెన్ యం.అశోక్‌కుమార్ అర్చకులతో కలిసి పూర్ణకుంభ స్వాగతం పలికారు. నాయమూర్తి శ్రీవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేయించగా అర్చకులు ద్వారకనాథాచార్యులు, బాలాజీచార్ ఆలయ విశిష్టత, పురాణ ప్రాశస్త్యాని న్యాయమూర్తికి తెలిజేశారు. ఆయన్ను శాలువాకప్పి సన్మానించి శ్రీ లక్ష్మినరసింహస్వామి వారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు.